క్లుప్తంగా

చెట్టు విలువ!



చెట్టు కింద సేదతీరుతున్న మేకలు, పొట్టేళ్లు

మహానంది: మండుతున్న ఎండలకు జనం అల్లాడుతున్నారు. చెట్లను ఇష్టానుసారం నరికివేడంతో పర్యావరణం దెబ్బతినడంతో వేసవి తాపం ఎక్కువైంది. పొలాల్లో మేతకు వెళ్లిన గొర్రెల మంద ఎండలకు తట్టుకోలేక గుంపుగా ఓ చెట్టు కింద సేదతీరుతున్న దృశ్యం చెట్టు విలువను చెప్పకనే చెబుతుంది. మహానంది సమీపంలో దృశ్యం కనిపించింది.

భక్తి శ్రద్ధలతో చందన యాత్ర ఉత్సవాలు



జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథుని మందిరంలో ఆదివారం జగన్నాథుని చందన యాత్ర మహోత్సవాలు –2024 అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నైవేద్య సేవలు నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు భక్తులకు సందేశమిచ్చారు. హరే నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా శంకర జయంతి



ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు, ఈఓ దంపతులు

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలధార పంచధార వద్ద ఉన్న ఆదిశంకరాచార్యుల ఆలయంలో ఆయన జయంతోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆది శంకరాచార్యుల వారికి, చంద్రమౌళీశ్వరస్వామికి జలాభిషేకం, పంచామృతాభిషేకం షోడశోపచార పూజలు వేదమంత్రోచ్చారణలతో నిర్వహించారు. ఈఓ పెద్దిరాజు దంపతులు అర్చకస్వాములు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన పెద్దమ్మ ఆలయ సమీపంలో ఉన్న నిత్యాన్నదాన సంస్థ భవన నిర్మాణానికి ఆదివారం కోవెలకుంట్ల పట్టణానికి చెందిన పాణ్యం రాఘవేంద్రారెడ్డి, లీలావతమ్మ కుటుంబ సభ్యులు రూ.25,001 విరాళంగా అందజేశారు. ఈ మేరకు సంస్థ కమిటీ సభ్యులకు దాతలు నగదు ఇచ్చారు.

గ్రామాలకు చేరిన ఎన్నికల సిబ్బంది



చిన్నకంబలూరులో బ్యాలెట్ నమూనాలను గోడకు అతికిస్తున్న ఎన్నికల సిబ్బంది

రుద్రవరం: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో అధికారులు ఎన్నికల నిర్వాహణకు సంబంధించి ఆదివారం రాత్రికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటర్లు క్యూలైన్‌లో నిలిచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారికేడ్లు, ఎండ నుంచి రక్షణగా షామియానాలు, నీటి వసతి వంటి సౌకర్యాలు కల్పించారు.అలాగే ర్యాంపులు,వీల్‌ఛైర్లు, వైద్యం వంటి వసతులు కల్పించారు. 50 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం రాత్రి సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. సోమవారం ఉదయం నుంచి పోలింగ్ ప్రక్రియ మొదలు కానుండటంతో రాత్రే బ్యాలెట్ నమూనాలను గోడలకు అతికించారు. పెద్దకంబలూరు పోలింగ్ కేంద్రాన్ని మోడల్‌గా రూపుదిద్దారు.



పెద్దకంబలూరులో మోడల్ పోలింగ్ కేంద్రం



ఎన్నికల సామగ్రి, సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా వాహనాలు



సమస్యాత్మక పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక పోలీస్ బలగాలు

ఓటేద్దాం..రండి

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ఆళ్లగడ్డ అసెంబ్లీకి 18 మంది, పార్లమెంట్‌కు 31 మంది అభ్యర్థుల పోటీ
- 2,30,560 మంది ఓటర్ల చేతిలో భవితవ్యం
- నియోజకవర్గ వ్యాప్తంగా 295 పోలింగ్ కేంద్రాలు
- విధుల్లో సుమారు 2,600 మంది సిబ్బంది.
- వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు



ఎన్నికల విధుల కేటాయింపు, సామగ్రి కోసం హాజరైన అధికారులు, సిబ్బంది

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల క్రతువులో అత్యంత కీలక ఘట్టమైన పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం జరిగే ఎన్నికల సమరానికి యంత్రాంగం రెడీ అయింది. ఆళ్లగడ్డ నియోజకర్గంలోని 295 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల దాకా పోలింగ్ జరగనుండగా ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. 295 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని ఆదివారం రాత్రికే ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపారు. నియోజకవర్గంలో 18 మంది శాసనసభకు, 31 మంది నంద్యాల పార్లమెంట్ బరిలో ఉండగా 2,30,560 మంది ఓటర్లు వీరి భవితవ్యం తేల్చనున్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు 2600 మంది సిబ్బంది, అధికారులు విధులు నిర్వర్తిస్తుండగా సుమారు వెయ్యి మంది పోలీసులు బందోబస్తులో తలమునకలయ్యారు. పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించనున్నారు.

సాయంత్రం 6 గంటల లోపు పోలింగ్ కేంద్రంలో ఉంటేనే..

నియోజకవర్గంలోని ఆరు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 295 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఓటు వేసేవారు సాయంత్రం 6 గంటల లోపు పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. 6 గంటల లోపు పోలింగ్ కేంద్రంలో ఉంటే ఎంత సమయమైనా వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

2,360 మంది పోలింగ్ సిబ్బంది..

నియోజకవర్గంలోని 295 పోలింగ్ కేంద్రాలకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి పీఓ, ఏపీఓ, నలుగురు ఓపీఓలతో కలిపి ఆరుగురు చొప్పున మొత్తం 2,360 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించారు. వీరితో పాటు అదనంగా మరికొంత మంది సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. రూట్ ఆఫీసర్‌లు, సెక్టోరియల్ అధికారులు, అబ్జర్వర్లు ఇలా మొత్తం సుమారు 2,600 మంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.

29 రూట్లు.. 81 వాహనాలు

నియోజకవర్గంలో 29 రూట్లు ఏర్పాటు చేశారు. ఆయా రూట్లలో ఎన్నికల అధికారులను, సామగ్రిని తరలించేందుకు 71 పెద్ద బస్సులు, 9 మినీ బస్సులు, ఒక తుఫాన్ జీపు ఇలా మొత్తం 81 వాహనాలను కేటాయించారు. ప్రతి రూట్‌కు ఒక సెక్టోరియల్ అధికారిని నియమించారు. ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చారు.

'ఆదర్శ'ంగా ఆకట్టుకునేలా..!

ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచటమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు చేపడుతోంది. ఈ క్రమంలో ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని సెయింటాన్స్ పాఠశాలలో 163వ పోలింగ్ కేంద్రాన్ని మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో మహిళా అధికారులు, సిబ్బంది మాత్రమే విధుల్లో ఉండటంతో పాటు పోలీసులు సైతం మహిళలనే నియమించారు. యువత కోసం టీబీరోడ్‌లోని 159 పోలింగ్ కేంద్రంలో 'యంగ్ పోలింగ్ కేంద్రం' ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా అందరు యువ అధికారులు, సిబ్బంది మాత్రమే విధులు నిర్వహించనున్నారు. వీటిని ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో భాగంగా అక్కడ అన్ని వసతులు కల్పించి ఆకర్షణీయంగా,ఆకట్టుకునే రీతిలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్ల పిల్లలు ఆడుకునేందుకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పలు రకాల వసతులు కల్పించారు. అధికారులు సాయంత్రానికి కేంద్రాలకు చేరుకున్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్ జెండర్	మొత్తం
దొర్నిపాడు	26	10,003	10,053	0	20,056
ఉయ్యాలవాడ	30	11,207	11,469	2	22,678
శిరివెళ్ల	62	23,345	23,590	4	46,939
ఆళ్లగడ్డ	74	30,751	32,183	5	62,939
రుద్రవరం	51	18,822	18,862	1	37,685
చాగలమర్రి	52	20,183	20,432	2	40,617
మొత్తం	295	1,14,311	1,16,589	14	2,30,914



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌ఓ



స్టేషనరీ,ఎన్నికల సామగ్రిని ఎన్నికల అధికారులకు అందజేస్తున్న సిబ్బంది



సెయింటాన్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రం

భారీగా పోలీసు బలగాల మోహరింపు

- స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటువేయాలని జాయింట్ కలెక్టర్ పిలుపు



ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న అధికారులు, సిబ్బంది



ఎన్నికల సామగ్రితో బస్సుల్లో వెళ్తున్న అధికారులు, పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: ప్రచారాలతో హోరెత్తిపోయిన నంద్యాల నియోజకవర్గం సోమవారం ఓటింగ్‌తో పోటెత్తనుంది. పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకర్గంలోని నంద్యాల టౌన్, నంద్యాల మండలం, గోస్పాడు మండలంలోని 2,67,645 మంది ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మొత్తం 286 పోలింగ్ కేంద్రాలు 1,716 మంది సిబ్బందిని నియమించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రిని ఆర్టీసీ బస్సుల్లో నియోజకవర్గంలోని నంద్యాల పట్టణం, నంద్యాల, గోస్పాడు మండలాల్లో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తీసుకెళ్లారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా ఎన్‌ఎండీ ఫరూక్‌తో పాటు మరో 26 మంది పోటీలో నిలిచారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు..

నియోజకవర్గంలో 286 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 11 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. నంద్యాల మండలంలో కొత్తపల్లె, కానాల, అయ్యలూరు గ్రామాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. పట్టణంలోని హరిజనపేట, నడిగడ్డలోని వివేకావర్ధని స్కూల్, బైర్మల్ వీధి, ఎస్పీజీ, బీసీ బాయ్స్ హాస్టల్ దేవనగర్, మున్సిపల్ ప్రైమరీ పాఠశాల దేవనగర్, నూనెపల్లెలోని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు.

నియోజకవర్గ ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
నంద్యాల (పట్టణం)	96,271	1,01,320	83	1,97,674
నంద్యాల	18,739	19,859	04	38,602
గోస్పాడు	15,228	16,094	07	31,369
మొత్తం	1,30,278	1,37,273	94	2,67,465

భద్రత కట్టుదిట్టం..

నంద్యాల ఎన్నిల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వద్ద సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో డీఎస్పీతో పాటు మూడు కేంద్ర బలగాలు, రెండు రాష్ట్ర బలగాలు, 12మంది సీఐలు, 200 మంది ఎస్ఐలు, 400మంది పోలీసులు, 100 మంది హోంగార్డులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, 50మంది మాజీ సైనికులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ ముగిసేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి. నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఐదు మందికి మించి గుమిగూడితే కేసులు నమోదు చేస్తాం.

– రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎన్నికల అధికారి



నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి కోసం హాజరైన సిబ్బంది

సంక్షేమ పాలనకు గిరిజనుల మద్దతు



మాట్లాడుతున్న రాజు నాయక్

నంద్యాల టౌన్: గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, గిరిజనుల కుటుంబాలకు ఆర్థికంగా, విద్యా, వైద్య, రాజకీయంగా అండగా నిలిచి గిరిజనులకు నామినేటెడ్ పదవులు కల్పించిన ప్రభుత్వ పునః స్థాపనే లక్ష్యంగా కృషి చేస్తామని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో గిరిజన ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో గిరిజనులకు ప్రభుత్వంలో వివిధ ఉన్నత స్థాయి పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. గిరిజనులకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసి, మైదాన ప్రాంతానికి చెందిన గిరిజన నేతలకు కమిషన్ మెంబర్, టీటీడీ బోర్డు మెంబర్, శ్రీశైలం బోర్డు మెంబర్,ఒక ఎమ్మెల్సీ తోపాటు అనేక నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థలలో కూడా రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. 500 జనాభా కలిగిన 105 గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అలాగే అటవీ, రెవెన్యూ భూములు సాగు చేసుకుంటున్న 1,50,055 కుటుంబాలకు 3,26,862 ఎకరాలను గిరిజన లబ్ధిదారులకు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో జీపీఎస్ రాష్ట్ర హాయ కార్యదర్శి రవి నాయక్, ఎన్‌టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాముడు, బంజారా ధర్మసేన రాజారాం నాయక్, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ శంకర్ నాయక్, ఉశేనమ్మ పాల్గొన్నారు.



ఎంఎస్ నగర్ పురపాలక ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఏర్పాట్లు



నూనెపల్లె అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఎన్నికల ఏర్పాట్లు చేసిన దృశ్యం



ఎస్పీజీ పాఠశాల వద్ద పూర్తయిన ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి



క్రిష్టిపాడులో సుందరంగా అలంకరించిన మోడల్ పోలింగ్ స్టేషన్

సర్వం సిద్ధం

- ఓట్ల పండుగకు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది, పోలీసులు
- సర్వాంగ సుందరంగా మోడల్ పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ సరళని పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు
- ఎన్నికల నిర్వహణకు మొబైల్ టీంల నియామకం



శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ బూత్

నంద్యాల(సిటీ): ఓట్ల పండుగ రానే వచ్చింది. సోమవారం పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రమే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పూర్తి సామగ్రితో చేరుకున్నారు. ఇక పోలింగ్ బూత్‌లో ఓటర్లు, అధికారులకు అవసరమైన వసతులన్నీ కల్పించారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా సాగేలా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో కేంద్రబలగాలను మోహరించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల అధికారులు, స్థానిక అధికారులు చర్యలు పకడ్బందీగా చేపట్టారు.

నంద్యాలలో..

నేడు జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఆదివారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించి పోలింగ్ నిర్వహణకు వచ్చిన అధికారులకు, ఓటర్లకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి నీరు, ఫ్యాన్లు, లైటింగ్, షామియానాలు తదితర సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. మరికొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులు, వృద్ధులు ఎక్కడానికి ర్యాంపులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో మున్సిపల్ సిబ్బంది బూత్ అధికారులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. సైన్ బోర్డులు, సూచికలు ప్రతి ఒక్కరికీ కనపడేలా ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించారు.



పీఎస్ నంబర్ 34 వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

దొర్నిపాడు: సోమవారం జరగబోయే సాధారణ ఎన్నికల పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని 26 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు దివ్యాగులు, వృద్ధుల కోసం ట్రైసైకిళ్లను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా క్రిష్టిపాడులోని పోలింగ్ స్టేషన్– 5ను మోడల్ సెంటర్‌గా సుందరంగా అలంకరించారు.

శిరివెళ్ల: ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు గాను అధికారులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 56 పోలింగ్ బూత్‌లను ఏర్పాట్లు చేశారు. అత్యధికంగా శిరివెళ్లలో 16 బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలంలో 47,453 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్‌కు పోలీస్‌లు భారీ బందోబస్తు కల్పించారు. ఒక సీఐ, నలుగురు ఎస్ఐలు, 65 మంది పోలీస్ సిబ్బందిని నియమించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరా బిగించారు. మొబైల్ టీంను ఏర్పాటు చేశారు.



ఇంజేడులో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

ఉయ్యాలవాడ : మండలంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటరినింగ్ అధికారి వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పోలింగ్ కేంద్రాల్లో మహిళలు 11,284 మంది, పురుషులు 11,572, ఇతరులు 2 మొత్తం 22,858 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాల్లో ఏపీఓతో పాటు అసిస్టెంట్ పోలింగ్ అధికారులతో కలిపి పోలింగ్ నిర్వహణ కోసం 180 మంది సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు.

చాగలమర్రి: పోలింగ్‌కు మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు, ఏర్పాట్లు పూర్తి చేశామని ఏఆర్‌ఓ రమణమ్మ శనివారం తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లోపోలింగ్ సరళిని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించేందుకు వీలుగా ప్రతి పోలింగ్ కేంద్రంలో బయట, పోలింగ్ బూత్ వద్ద సీసీ కెమెరాలను అమర్చారు. అలాగే ఓటర్లకు ఎండ, వేడిమి నుంచి ఉపశమనం కలగటానికి షామియానాలు, తాగు నీటి సౌకరం కల్పించారు. 52 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించేందుకు 4 మొబైల్ టీంలను ఏర్పాటు చేశామని, మొత్తం 40,664 మంది ఓటుర్లు ఉండగా వారిలో పురుషులు 20,180 కాగా, స్త్రీలు 20,584 వేల మంది ఉన్నారని చెప్పారు. ఉదయం 5.30 గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద మాక్ పోలింగ్ నిర్వహిస్తారని, పోటీలో నిలిచిన అన్ని పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు పాల్గొనాలని ఏఆర్‌ఓ తెలిపారు.



పెద్ద వంగలి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, షామియానా